క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా దాకమర్రి, బోడమెట్టపాలెం, రామునాయుడుపేట, ముద్దాడపేట, అల్లుపేట, రెల్లిపేట, దాకమర్రి పారిశ్రామిక ప్రాంతం, దాకమర్రి కూడలి, రఘు ఇంజనీరింగ్ విద్యాసంస్థలు, ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల, ప్లై వుడ్ కంపెనీలు, జొన్నాడ టోల్‌గేట్, కాళ్లవారి కళ్లాలలోని గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో..

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలోని లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ప్రకటనలో తెలిపారు. రెడ్డిపల్లి, శేరిఖండం, పొట్నూరు, తునివలస, నరసాపురం, చిన్నాపురం, నేరేళ్లవలస, విజయానందపురం, కొయ్యపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

శ్రీబాసర విద్యార్థుల రక్తదానం



సర్టిఫికెట్లతో రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

తగరపువలస: స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన మెగా రక్తదాన శిబిరంలో 60 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కేజీహెచ్ రక్తదాన నిధి సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి డాక్టర్ టీవీ నాయుడు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు చప్పా సురేష్, వి.వి.డి.రమేష్, ఏవో కేశవ, వైస్ ప్రిన్సిపాల్ బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పద్మనాభం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 160 మందికి పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, యూరిన్, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి వైద్యుడు భార్గవ్, వైద్యులు శివ ప్రసాద్, సింధు, ప్రభు తేజ, హిమజ ఈ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షురాలు టి.నాగమణి, ఉపాధ్యక్షులు పి.కృష్ణారావు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ గ్లాసుల పంపిణీ



దాత అప్పలరాజు అందించిన గ్లాసులతో విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సాయి సంహిత ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు శుక్రవారం స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. 60 మంది విద్యార్థులకు రూ.3వేల విలువైన ఈ గ్లాసులు అందించినట్టు తెలిపారు. ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలకు అవసరమైన వస్తువులను నాలుగేళ్లుగా అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శామ్యూల్ రాణి, ఉపాధ్యాయుడు ఎస్.రమణారావు పాల్గొన్నారు.

రెండో రోజూ దుకాణాల తొలగింపు





తగరపువలస రహదారి పక్కన ఉన్న బడ్డీలను క్రేన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం, టౌన్ ప్లానింగ్, శానిటరీ అధికారులతో స్థానికుల వాగ్వాదం

- పండగ ముందు కక్ష సాధిస్తున్నారని వ్యాపారుల ఆవేదన
- అధికారులతో వాగ్వాదం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధి తగరపువలస మెయిన్‌రోడ్డులో డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు రెండో రోజైన శుక్రవారం వ్యాపారుల ఆందోళనల మధ్య కొనసాగింది. టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, సచివాలయ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. వ్యాపారులు డ్రైనేజీలు మూసివేయడంతో పారిశుద్ధ్య పనులకు ఇబ్బంది కలుగుతోందని జేసీబీ సాయంతో గంట్లు పెట్టి వదిలేశారు. వ్యాపారులు వాటిని క్లియర్ చేసుకోకపోతే జేసీబీతో కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు. రహదారులపైకి వచ్చి నిర్మించిన షెల్టర్లను కొన్నిచోట్ల వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకోగా, మిగిలిన వాటిని జేసీబీతో అధికారులు తొలగించారు. డ్రైనేజీల ముందుకు వచ్చి పెట్టిన బడ్డీలను క్రేన్‌తో తొలగించారు. ఇదిలా ఉండగా దసరా, దీపావళి పండగల ముందు అధికారులు తమపై కక్ష సాధిస్తున్నారని వ్యాపారులు మండిపడ్డారు. తోపుడుబండ్లు, చిరు వ్యాపారులైతే ఈ సంఘటనలతో తమ జీవనోపాధి పూర్తిగా పోయిందని వాపోయారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్లను తొలగించడంతో మెయిన్‌రోడ్డుపై వాహనాలు ఇప్పుడు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నాయి.

పేదలకో రూల్.. పెద్దలకు మరొకటా?

- వాణిజ్య సముదాయంలో నామమాత్రపు తొలగింపుపై చిరు వ్యాపారుల ఆగ్రహం



రుషికొండ ప్రధాన రహదారి వద్ద నామమాత్రంగా తొలగించిన వాణిజ్య సముదాయం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ ప్రధాన రహదారి వెంబడి ఉన్న వాణిజ్య సముదాయాలను జీవీఎంసీ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నామమాత్రంగా తొలగించడంపై చిరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఎండాడ– రుషికొండ డబుల్ రోడ్డులో ఉన్న దుకాణ సముదాయాలు తొలగించడానికి రెండు పొక్లెయిన్లు, పది మంది అధికారులతో వచ్చి కాస్త సమయం ఇవ్వకుండా దుకాణాలు తొలగించిన అధికారులు.. రుషికొండ ప్రధాన రహదారిలో ఉన్న వాణిజ్య సముదాయాలను తొలగించడంలో వెనుకడుగు వేయడం ఏమిటంటూ చిరు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పేదవాడిని ఒకలా, ఉన్నవాడిని ఒకలా చూస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తొలగిస్తే పూర్తి స్థాయిలో అన్నీ తొలగించాలి కానీ, నామమాత్రంగా తొలగించడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు కూడా మౌనం వహిస్తున్నారు.

జేడీస్ కార్యాలయం ఎదుట వ్యాపారుల బైఠాయింపు



జేడీస్ చాంబర్ ఎదుట బైఠాయించిన చిల్లర వర్తకులు

మధురవాడ: రోడ్డు పక్క ఉన్న చిల్లర దుకాణాలు, తోపుడు బళ్ల తొలగింపుపై చిరు వ్యాపారులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ అనుబంధ విశాఖ తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం ఆధ్వర్యంలో జోన్–2 కమిషనర్ చాంబర్ ఎదుట శుక్రవారం బైఠాయించారు. ముందుగా మిథిలాపురి వుడా కాలనీ, కారుషెడ్, చంద్రంపాలెం మీదుగా మధురవాడ జోనల్ ఆఫీసు వరకు బ్యానర్లు, జెండాలతో ర్యాలీగా వచ్చి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం జేడీస్ చాంబర్ ఎదుట బైఠాయించి అధికారుల నిరంకుశ ధోరణి, ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినదించారు. సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు మాట్లాడుతూ దుకాణాల తొలగింపు కారణంగా సుమారు 500 మంది వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. వీరి రాకను గమనించిన అధికారులు ఆఫీసుకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకు కదలబోమంటూ వారు మధ్యాహ్నం వరకు బైఠాయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదినారాయణ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



ఫుట్‌పాత్‌పై పెట్టిన తోపుడు బండిని తీయిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ వ్యాపారులు యథావిధిగా వ్యాపారాలు నిర్వహించడంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఈ రోడ్డులో పర్యటించారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేసినా, ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని టీపీవో శ్రీలక్ష్మిని ఆదేశించారు. ఉదయం 7గంటల లోపే పారిశుధ్య పనులు పూర్తి చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించినా పూర్తి చేయక పోవడంపై మండిపడ్డారు. ముందు రోజు ఆక్రమణలు తొలగించినా ఇంకా చెత్త అక్కడే ఉందని, తక్షణమే పారిశుధ్య పనులు పూర్తి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ని ఆదేశించారు. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు, వాహనదారుల కోసం విశాలమైన రోడ్లను ఏర్పాటు చేశారని, వాటిని ఆక్రమణలకు పాల్పడవద్దని తెలిపారు. ఆయన వెంట జేడీస్ కనక మహాలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



దుర్గాలమ్మ ఆలయంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభమై వచ్చే నెల 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అందులో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు, అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు ఉంటాయని తెలియజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కుంకుమ పూజలు, తర్వాత హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 29న, వచ్చే నెల 3వ తేదీన ఆలయ ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ ఉంటుందన్నారు. ప్రత్యేక పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఆలయంలో గుమస్తాను, కమిటీ పెద్దలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్‌లో వ్యర్థాలను తొలగించారు



వ్యర్థాలను తొలగించిన అనంతరం ట్రాఫిక్ ఐలాండ్ ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ కూడలి వద్ద ఉన్న ట్రాఫిక్ ఐ లాండ్ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో డస్ట్‌బిన్‌గా మారింది. దీనిపై సాక్షి దినపత్రికలో 'డస్ట్‌బిన్‌లా ట్రాఫిక్ ఐలాండ్' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించారు. శానిటరీ సిబ్బందితో ట్రాఫిక్ ఐలాండ్‌లో వ్యర్థాలను తొలగించారు. మళ్లీ ఎవరైనా ట్రాఫిక్ ఐలాండ్‌లో వ్యర్థాలు వంటివి ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఎం నేత మూర్తికి పితృ వియోగం



సింహాద్రప్పడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, లోకనాథం, జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: సీపీఎం జిల్లా భీమిలి జోన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.ఎస్.ఎన్. మూర్తి తండ్రి సింహాద్రప్పడు (75) శుక్రవారం ఉదయం మృతి చెందారు. పది రోజులుగా కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. విశాఖలో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో పాటు పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు కేజీహెచ్‌కు వెళ్లి సింహాద్రప్పడు భౌతికకాయానికి నివాళులర్పించారు. సింహాద్రప్పడు పెద్ద కుమారుడు మూర్తి సీపీఎం, సీఐటీయూలో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండగా, కోడలు లక్ష్మి అంగన్‌వాడీ సీఐటీయూ యూనియన్ నాయకురాలిగా ఉన్నారు.

మధురవాడలో హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పైడిరాజు డిమాండ్

మధురవాడ: ప్రభుత్వం బడా వ్యాపారులకు ఒక న్యాయం, చిరు వ్యాపారులకు మరో న్యాయం అన్నట్లు వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు అన్నారు. ఆక్రమణల పేరుతో మధురవాడ పరిసర ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా వీధి వ్యాపారులు, చిల్లర వర్తకుల దుకాణాలు తొలగించడం సరికాదన్నారు. వారికోసం హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మధురవాడ డీ మార్టు వద్ద నిత్యం ట్రాఫిక్ పెద్ద ఎత్తున జామ్ అవడంతో పాటు వాహనదారులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని.. ఇటువంటి వారిని ఏమీ చేయలేని అధికారులు కుటుంబ పోషణ కోసం రోడ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం అన్యాయమన్నారు. వీరికి వెంటనే న్యాయం చేయాలని, లేకపోతే వారి తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాకంటకంగా కూటమి పాలన



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, ఆరోగ్యశ్రీ భవిష్యత్తు ప్రశ్నార్థకం వంటి చర్యలతో కూటమి ప్రభుత్వం ప్రజాకంటకంగా తయారైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చిట్టివలసలో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక మెడికల్ కళాశాల ఉండాలనే లక్ష్యంతో రూ.8,480 కోట్లతో 17 కళాశాలల నిర్మాణాలను ప్రారంభించారన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో 5 మెడికల్ కళాశాలల నుంచి రాష్ట్రానికి అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయన్నారు. డాక్టర్ కావాలన్న పేద విద్యార్థులు తమ కల నిజం చేసుకున్నారన్నారు. మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం కళాశాలలు పూర్తయి ఉంటే మరో 750 సీట్లు వచ్చేవన్నారు. పీపీపీ పేరుతో 10 ప్రభుత్వ కళాశాలలను ప్రైవేట్ చేతుల్లో పెట్టడంతో కూటమి ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైందన్నారు. ప్రైవేట్‌పరం చేసిన కళాశాలలు 63 ఏళ్ల పాటు వారి ఆధీనంలో ఉండటం వలన, పేదలకు ఉచిత వైద్యం దూరమవుతుందన్నారు. వైఎస్ జగన్ అందించిన రూ.25 లక్షల పరిమితితో ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం బీమా సంస్థలపై ఆధారపడి రూ.2.50 లక్షలకు పరిమితం చేస్తోందన్నారు. పేదల కలలు చిదిమేసి విద్య, వైద్యం దూరం చేస్తున్న ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుంటుందని విమర్శించారు.

27 మద్యం బాటిళ్ల స్వాధీనం

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు పంచాయతీల్లోని పాన్‌షాపుల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. శొంఠ్యాం పంచాయతీ నీళ్లకుండీలు జంక్షన్ వద్ద మాటూరి సత్యారావు(60)కు చెందిన పాన్‌షాపు నుంచి 21 బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఎస్‌ఐ జి.శివ కేసు నమోదు చేశారు. అలాగే గంభీరం పంచాయితీ దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో కనకదుర్గ పాన్‌షాపులో దుక్క రమణ(61) నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఎస్‌ఐ బి.సంతోష్ కేసు నమోదు చేశారు.

బాబా విభూది పంపిణీ ప్రారంభం

- సత్యసాయి శత జయంత్యుత్సవాల సందర్భంగా వంద గ్రామాల్లో పంపిణీకి శ్రీకారం



గొట్టిపల్లిలో ప్రారంభించిన విభూది పంపిణీ రథం

తగరపువలస: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా సత్యసాయి సేవా సంస్థలు విశాఖ జోన్ పరిధిలో చిట్టివలస, ఆనందపురం, భీమిలి, గొట్టిపల్లి, పద్మనాభం సమితులకు కలుపుతూ 100 గ్రామాలలో ప్రత్యేక రథంపై బాబా విభూది పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లిలో ఈ కార్యక్రమాన్ని జిల్లా సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఆర్.ఎ. నాయుడు ప్రారంభించారు. అనంతరం స్థానిక ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో 55 మంది మహిళలకు 40 రోజుల పాటు ఉచితంగా టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణను ప్రారంభించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మహిళా కో–ఆర్డినేటర్ బి.అమ్మాజీ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి పథకాలు కల్పించి, ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కె.ఈశ్వరి, బి.సాయికుమార్, టీవీవీ సత్యనారాయణ, జి.అపర్ణ, మానాపురం సత్యసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టిన జీవీఎంసీ



మాట్లాడుతున్న సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి రాంబాబు

తగరపువలస: ముందస్తు సమాచారం లేకుండా జీవీఎంసీ అధికారులు మెయిన్‌రోడ్డు, భీమిలి రోడ్డులోని దుకాణాల ముందు షెల్టర్లు తొలగించి చిరువ్యాపారుల పొట్ట కొట్టారని సీపీఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారుల బతుకు తెరువుకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించిన జీవీఎంసీ, వారికి ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. వ్యాపారులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేసి, సూచనలు స్వీకరించిన తరువాత ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నష్టం కలిగిన వ్యాపారుల తరపున సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, ఆదినారాయణ, అప్పారావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



కె.ధనలక్ష్మి

తగరపువలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 తైక్వాండో పోటీల్లో ఆనందపురం కేజీబీవీ ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థిని కె.ధనలక్ష్మి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పరవాడ ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన ధనలక్ష్మిని ప్రధానోపాధ్యాయిని ఎస్.లావణ్య, ఎస్‌ఎంసీ ప్రతినిధులు కోరాడ శివాజీ, మంగ అప్పన్న, బంగారురాజు, దేవుడు బాబు, పీఈటీ బండారు రమాదేవి శుక్రవారం అభినందించారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖరులు

భీమునిపట్నం: రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన విధానాన్ని నిరసిస్తూ భీమిలిలోని దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్ డౌన్ చేపట్టారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి, ఆస్తుల రిజిస్ట్రేషన్లు మరియు రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల వల్ల దస్తావేజులు తయారు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఇది పెద్ద సమస్యగా ఉందని అన్నారు. దీనివల్ల తమకు ఇబ్బందిగా ఉండడంతో పాటు ఇక్కడికి పనుల నిమిత్తం వచ్చేవారికి కూడా సమస్యగా ఉంటోందన్నారు. అందువల్ల ప్రభుత్వం స్పందించి, ఇందులో లోపాలను సరిచేయాలని కోరారు. లేకుంటే, నిత్యం అవస్థలు తప్పవన్నారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు బేత లక్ష్మి, వి.వి.సుబ్రహ్మణ్యం, అడిదం కిశోర్, భాను, సాయి,కామేష్, ఎస్.గోవింద్, కోట వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మల్లకంబ పోటీలకు ఎంపిక



అండర్–14 విభాగంలో మల్లకంబ పోటీలకు ఎంపికైన బాలురు

తగరపువలస: రాష్ట్రస్థాయి మల్లకంబ పోటీలకు ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహారకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖలో ఈ ఎంపిక జరిగింది. అండర్–14 బాలుర విభాగంలో ఐ.సద్గుణాకర్ నాయుడు, ఎన్.హర్షారామ్, టి.సాత్విక్‌కుమార్, ఆర్.చందు బాలికల విభాగంలో బి.సాయిగీత, ఐ.పవిత్ర, ఎ.లక్ష్మి వెన్నెల, టి.తనిష్క ఉన్నారు. అండర్–17 బాలుర విభాగంలో ఎస్.చైతన్య, పి.చరణ్‌తేజ, డి.రోహిత్ కృష్ణకాంత్, ఎల్.జ్ఞానేశ్వర్ బాలికల విభాగంలో అవంతిక మహతో, బి.హనీషా, కె.హరిణిసాయి, ఎం.షర్మిల ఉన్నారు. వీరిని సమితి ప్రధాన ఆచార్యులు డీవీఎల్ సావిత్రి, విజ్ఞాన విహార కమిటీ సభ్యుడు బాలి రవి, ఎస్‌జీఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ బి.చిన్మయ దేవుళ్లు అభినందించారు.

ఎండీఎంఎల్ యాప్‌తో ఆర్థిక మోసాలకు చెక్



విజయరాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పద్మనాభం: 'మన డబ్బులు–మన లెక్కలు (ఎండీఎంఎల్)' యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల్లో ఆర్థిక లావాదేవీల్లో మోసాలను నివారించవచ్చని డీఆర్‌డీఏ డీపీఎం వైదేహి అన్నారు. ఎండీఎంఎల్ యాప్‌పై బాందేవపురం పంచాయతీ విజయరాంపురంలో డ్వాక్రా సభ్యులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎండీఎంఎల్ యాప్ ద్వారా పొదుపు ఎంత ఉందో తెలుసుకోవచ్చన్నారు. యాప్‌లో రుణాలను చెల్లించవచ్చని, అలాగే రుణం ఇంకా ఎంత కట్టాలో కూడా తెలుస్తుందని అన్నారు. పొదుపులు, అప్పుల సమాచారం తప్పుగా నమోదైతే, వాయిస్ రికార్డు రూపంలో యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. యాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.వి.రమణ, సీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం స్వస్థ నారీ–సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఆస్పత్రుల సర్వీసెస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శంకర ప్రసాద్, ఆయుష్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యుడు ఫణికుమార్ పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపుపై అధికారుల చర్యలు



నగరంపాలెం శ్మశాన వాటిక స్థలంలో కప్పిన గోతులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం శ్మశాన వాటికను ఆనుకుని కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా గ్రావెల్ తరలించడంపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ స్పందించారు. వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డు అనుసంధాన పనుల కోసం శ్మశాన వాటికను ఆనుకుని గ్రావెల్ తవ్వి, కొద్ది రోజులుగా అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అధికారులకు ఫిర్యాదు ఇవ్వడంతో, వారు స్పందించి చర్యలు చేపట్టారు. శ్మశాన వాటిక గోడ కూలిపోయే పరిస్థితి తలెత్తడంతో, గ్రావెల్ కోసం తవ్విన గోతులను కాంట్రాక్టర్ పూడ్చారు. దీనిపై పైడిరాజు హర్షం వ్యక్తం చేశారు.

వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పైరుకు సోకిన తెగుళ్లను పరిశీలిస్తున్న ఏడీ విజయప్రసాద్

పద్మనాభం: వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భీమిలి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి జయ ప్రసాద్ సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన పొలం బడిలో వరి పంటకు తెగుళ్లు సోకినట్లు గుర్తించి, సూచనలు చేశారు.కార్యక్రమంలో ఏవో ఎంవీఎస్ చలం, ఏఈవో గౌస, వీఏ దిలీప్ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో అన్నసమారాధన నిర్వాహకులు అనిల్‌కుమార్ లావణ్య దంపతులు, ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు తదితరులు పాల్గొన్నారు.